# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

FEBRUARY - 2019

సంవత్సర సభ్యత్వము రూ॥ 50/-

# టి.వి. ద్వారా క్రీస్తు సంఘముల సువార్త పరిచర్యలు

## సత్యవాణి

ఆదివారం సాయంత్రం : 6.00 గంటలకు శుభవార్త

బుధవారం సాయంత్రం : 6.30 గంటలకు రక్షణ

గురువారం మధ్యాహ్నం : 2.30 గంటలకు రక్షణ

ప్రతిరోజు ఉదయం : 7.30 ని॥ కాంతి ఛానల్‌లో

ప్రతిరోజు మధ్యాహ్నం : 3.30 ని॥ కాంతి ఛానల్‌లో

ప్రసంగీకులు : జాషువా గూటం

రిక్కీ గూటం

రోనీ గూటం

Youtube లో satyavanicoc.kkd లో

పై కార్యక్రమములను చూడండి

మీ బంధుమిత్రులను కూడా ప్రోత్సహించండి.

ఉచిత బైబిలు కోర్సు కొరకు మాకు ఈరోజే వ్రాయండి


**SATYA VANI**

P.O.BOX. 80, KAKINADA

PIN : 533004. Ph : 0884 - 2363722

98489 98547, www.satyavanicoc.com

సత్యవాక్కు
THE WORD OF TRUTH
P.O. Box - 80, Kakinada, A.P. 533 001.
Ph : 0884-2363722 Cell : 98489 98547
Editor
JOSHUA GOOTAM
Pleading for Restoration of First Century Christianity
సంపుటి - 40 ఫిబ్రవరి - 2019 సంచిక -7

# దేవుడాజ్ఞాపించును, మానవుడు లోబడును

## ( God commands, Man Obeys)

దేవుని ప్రేమించుచున్నామని చెప్పుకొనుచు ఆయన మాటలకు లోబడని వారనేకులు ఉన్నారు. వారు దేవుని నిర్లక్ష్యము చేయుచున్నారు. దేవుని ప్రేమించుచున్నామని, భక్తిపరులమే అని వారు చెప్పుకొందురు గాని వారాయన మాటలను గైకొనరు. అయితే దేవుడు పనిచేయు విధానమును మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను. అదేమంటే దేవుడాజ్ఞాపించును, మానవుడు లోబడును. మానవుడు లోబడిన యెడల దేవుడతనిని ఆశీర్వదించును. అయితే దేవుడాజ్ఞాపించినప్పుడు మానవుడు విధేయత చూపిన యెడల ఆ మానవుని దేవుడు శిక్షించును; ప్రతి దండన చేయును. మానవుడు దేవుని ఆజ్ఞలకు లోబడినప్పుడు ఆయన అతని విశ్వాసమును కనుగొనునని బైబిలు బోధించుచున్నది.

### గ్రుడ్డి వాడు విధేయుడయ్యాడు :

ఒక పుట్టు గ్రుడ్డివాడు తన గ్రుడ్డితనమును బాగుచేయించుకొనగోరి యేసు నొద్దకు రాగా ఆయన ఉమ్మితో బురదచేసి, వాని కన్నుల మీద

ఆ బురద పూసి నీవు సిలోయము కోనేటికి వెళ్ళి అందులో కడుగు కొనుమని అతనితో చెప్పెను. వాడు యేసు చెప్పిన రీతిగనే వెళ్ళి కడుగుకొని చూపుగలవాడై వచ్చెను (యోహాను 9:1-7). అతడు యేసు చెప్పిన మాట ప్రకారము చేసినప్పుడే శుద్ధుడాయెను గాని అంతకు ముందుకాదు.

**నయమాను ఉదంతము :**

పాత నిబంధనలో, రెండవ రాజుల గ్రంథము 5వ అధ్యాయములో ఒక కుష్ఠరోగిని దేవుడు బాగుచేసెను. అతని పేరు నయమాను. సిరియా దేశపు సైన్యాధిపతియగు నయమాను గుఱ్ఱములతోను, రథములతోను వచ్చి దేవుని ప్రవక్తయైన ఎలీషా యింటి ద్వారము ముందర శుద్ధుడగుటకై నిలిచియుండగా, "నీవు యోర్దాను నదికి పోయి యేడు మారులు స్నానము చేయుము. నీ ఒళ్ళు మరలబాగై నీవు శుద్ధుడవగుదువని" అతనికి చెప్పబడెను. అయితే నయమాను ఈ సామాన్యసూత్రమునకు లోబడనొల్లక కోపము తెచ్చుకొని కుష్ఠరోగముతో తన దేశము తిరిగి వెళ్ళిపోబోయెను. గాని అతని దాసుని యొక్క మంచి సలహానుసరించి, అతడు పోయి దైవజనుడు చెప్పినట్లు యోర్దాను నదిలో ఏడుమారులు మునగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై అతడు శుద్ధుడాయెను. మనము దేవుని ఆజ్ఞలకు లోబడునప్పుడు దేవుడు మన విశ్వాసమును కనుగొనును. అందుకే దేవుని కుమారుడైన యేసుక్రీస్తు, "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని చెప్పెను (యోహాను 14:15). మీరు నన్ను ప్రేమించిన యెడల ఏకారణము చేతనయినను నన్ను నిర్లక్ష్యము చేయకుడి గాని, నిజానికి నా ఆజ్ఞలకు విధేయత చూపుడి అని ఇంకొక మాటలో ఆయన చెప్పుచున్నారు.

**అవిధేయత శిక్షను ఆహ్వానించును :**

దేవుని ఆజ్ఞలకు విధేయత చూపని యెడల మానవునికి కలిగే ప్రతి దండన యెట్టిదోకూడ బైబిలు అతి

విశదముగా బోధించుచున్నది. దేవుని మాటకు అవిధేయత చూపి నశించిన యిద్దరి మనుష్యులను మనము ఇక్కడ జ్ఞాపకము చేసికొందము. వారు నాదాబు, అబీహు అనువారు; దేవుని ప్రధాన యాజకుడైన అహరోను కుమారులు. వీరిద్దరు యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికితేగా యెహోవా సన్నిధి నుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను; వారు యెహోవా సన్నిధిని మృతి బొందిరి (లేవీ 10:1,2).

నిర్గమకాండము 32వ అధ్యాయములో ఒక సంఘటనను మనము చదువగలము. సీనాయి కొండ పై దేవునియొద్ద నుండి పది ఆజ్ఞలుగల రెండు వలకలను అందుకొనిన తరువాత, కొండక్రింద నున్న ఇశ్రాయేలీయులు దేవుడు వారికి నియమించిన త్రోవనుండి తొలగి పోయి తమ కొరకు ఒక బంగారు దూడను చేసికొని దానిని మ్రొక్కు చున్నారని మోషే తెలిసికొనెను. అతడు కొండదిగివచ్చి అందరికి కనబడు లాగున పాళెము యొక్క ద్వారమును నిలబడి, యెహోవా పక్షముననున్న వారందరు నా యొద్దకు రండి అనగా లేవీయులందరు అతని యొద్దకు కూడివచ్చిరి. వారట్లురాగా వారిలో ప్రతివాడును తన కత్తి తీసికొని బంగారు దూడకు మ్రొక్కిన వారి నందరిని హతము చేయవలెనను దేవుని ఆజ్ఞను మోషే వారికిచ్చెను. ఈ లేవీ కుమారులు దేవుని ఆజ్ఞకు విధేయులైరి. ఆ దినమందు జనము లలో ఇంచుమించు మూడువేల మంది కూలిరి యని లేఖనములు చెప్పుచున్నవి. దేవుడు విగ్రహారాధన చేయరాదని ఆజ్ఞాపించెను. ఇశ్రాయేలీయులు అవిధేయత చూపగా దేవుడు ఇంచుమించు మూడువేల మందిని ఒకేరోజున హతము చేసెను.

పాత నిబంధనలోను, క్రొత్త నిబంధనలోను కూడ ఇట్టి సందర్భము లను అనేకములను మనము కనుగొన గలము. వాటన్నిటి నుండియు మనము నేర్చుకొనవలసిన పాఠము యిదే. దేవుడాజ్ఞాపించును, మానవుడు

లోబడును. అవిధేయతను దేవుడు సహించనే సహించడు.

క్రొత్తనిబంధనలో అపొస్తులుల కార్యములు 5వ అధ్యాయములో అననీయ సప్పీరా అను దంపతులు దేవుని యెదుట అబద్ధమాడిరి. దేవుడా దినమందే వారిని హతము చేసెను. కల్లలాడు నాలుకను ఆయన అసహ్యించుకొనును (సామె 6:17).

**నమ్మి బాప్తిస్మము పొందుము :**

సువార్తను నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షించబడునని యేసుక్రీస్తు ఆజ్ఞాపించెను (మార్కు 16:16). ఈ ఆజ్ఞకు మానవుడు లోబడవలసినదే. నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడును. రక్షింపబడవలె నంటే నీటిలో ముంచడము బొందుట అవుసరము అని బైబిలు బోధించు చున్నది. అయితే బాప్తిస్మము ఒక్కటే ఏ మానివుని ఎన్నడు రక్షించదు. బాప్తిస్మము పొందుమని చెప్పుచున్న పచనమే విశ్వాసము కూడ అవుసరము అని చెప్పుచున్నది. అటు తరువాత ఒకడు మారు మనస్సు పొందవలెను లేని యెడల అతడు నశించును అని కూడ యేసు చెప్పెను. తరువాత యేసుప్రభు నందలి విశ్వాసమును మనుష్యుల యెదుట అతడు ఒప్పుకొన వలెను. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోక మందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును" అని యేసు చెప్పెను (మత్తయి 10:32,33).

ఇవన్నియు నేడు దేవుడు మానవుని కిచ్చుచున్న ఆజ్ఞలే. యేసు నందు విశ్వసించుము లేనియెడల నీ పాపములో నీవే నశింతువు. మారుమనస్సు బొంది బాప్తిస్మము పొందుము, దేవుడు నిన్ను దీవించును, నిన్ను రక్షించును. నీవు తిరిగి జన్మించ వలెను అని దేవుడు ఆజ్ఞాపించు చున్నారు. నీవు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను తిరిగి జన్మించ

వలెనని ఆయన చెప్పుచున్నారు. దేవుడాజ్ఞాపించును, మానవుడు విధేయత చూపును. నీవు బాప్తిస్మము పొందిన యెడల రక్షించబడుదువు అని యేసు చెప్పుచున్నాడు. నీవు ఆయనకు లోబడిన యెడల ఆయన నిన్ను ఆశీర్వదించును. ఈ ఒక్కొక్క ఆజ్ఞకు నీవు లోబడుటద్వారా నీవు నీ రక్షణను సంపాదించుకొనుటకు చేయు పుణ్య కార్యములు కావు యివి. గాని వీటికి విధేత చూపుటలో దేవుని యెడల నీకున్న ప్రేమను మాత్రము నిరూపించు వాడవగుదువు.

**లోబడుచూ యుండాలి :**

అట్లే నీవు క్రైస్తవుడవయిన తరువాత కూడ ఆయన ఆజ్ఞలకు లోబడుచూ యుండవలెను. ఆయన చెప్పిన రీతిగ క్రైస్తవ జీవితమును జీవించవలెను. ఆయన చెప్పిన రీతిగ దేవుని ఆరాధించవలెను. ఆయన నారాధించునపుడు నీవు ఆయన ఆజ్ఞల నుల్లంఘించిన యెడల ఆయన శిక్షకు పాత్రుడవగుదువు. నాదాబు, అబీహులు దేవుని మాటను బట్టిగాక తమ తలంపులను బట్టియే దేవుని నారాధించ ప్రయత్నించిరి. అందువలన మృతులైరి. ఆరాధనలో మనము వాద్యములు లేకుండా పాటలు పాడవలెను, ప్రార్ధనచేయవలెను, వాక్యోపదేశము జరిగించవలెను, ప్రభురాత్రి భోజనము నాచరించ వలెను, కానుకలియ్యవలెను అని దేవుడు ఆజ్ఞాపించుచున్నాడు. ఈ ఆరాధనను ప్రతి ఆదివారమున జరిగించవలెను. ఈ ఆజ్ఞలకు లోబడి మనము ఆరాధించిన యెడల ధన్యులమే. లేని యెడల దేవుని ఆజ్ఞల నుల్లంఘించిన వారమగుదుము. అయితే అట్టివారి గతియేమగునో బైబిలు విశదముగా బోధించుచునే యున్నది.

నీవు యెల్లప్పుడు యేసుప్రభు నకు లోబడి జీవించుటకు నిశ్చయించుకో. దేవుడాజ్ఞాపింపగా మానవుడు లోబడవలసినదేయని గ్రహించి జీవించుము. సకలానందము నీదగును!

# దేవుడు ప్రార్థనలకు జవాబిచ్చును

## ( God Answers Prayers )

దేవుడు తన బిడ్డల యొక్క ప్రార్థనలనాలకించునని బైబిలు విపులముగా బోధించుచున్నది. అయితే ప్రార్థించువాడు కోరుకున్నరీతిగా అన్ని ప్రార్థనలకు జవాబు లభించకపోవు ననునది కూడ విశదమే. అపొ.పౌలు తన శరీరములో యున్న ముల్లు లాంటి దాన్ని నిర్మూలించమని ముమ్మారు ప్రార్థన చేసాడు, గాని దేవుడు "నా కృప నీకు చాలునని" జవాబిచ్చారు (2 కొరింధి 12:7-9).

ప్రార్థించువాడు కొన్ని కారణములకొరకు ప్రార్థిస్తే వాని ప్రార్థన అంగీకరించబడదని యాకోబు చెప్పారు (యాకోబు 4:3, 1:5-8). "మీరడిగినను మీ భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీ కేమియు దొరకదు" అని అతడు చెప్పాడు. "ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననుదియే" యని యోహాను చెప్పాడు (1యోహాను 5:14).

ప్రార్థనను గూర్చి చెప్పు ఏదో ఒక లేఖనభాగమును తీసికొని క్రొత్త నిబంధన బోధ అంతా ఆ ఒక్కదానిలోనే యున్నదనుకొనుట పొరబాటు. దేవుడు తన బిడ్డల విషయమై చింతించు చున్నాడనునది క్రొత్తనిబంధన చేయు బోధ (1పేతురు 5:7). అయితే మనలను గూర్చి చింతించడం, మన ప్రార్థనలకు స్పందించడం రెండు ఒకటే కాదు, సమానము కాదు. "అడుగుడి మీ కియ్యబడునని" యేసు చెప్పినపుడు యాకోబు కూడ అక్కడ వున్నాడు (మత్తయి 7:7). అయినను ప్రార్థనలకు జవాబు షరతులపై ఆధారపడి యున్నదని మనం గ్రహించాలి.

ప్రార్థనలు దేవుని పై నున్న విశ్వాసముపై ఎల్లవేళల ఆధారపడి యున్నవి. మనకేది శ్రేష్ఠమో తెలిసి కొనుటకు మన జ్ఞానము దృక్పధము

సంకుచితములై యున్నవి. మన జీవితంలో చాలా సూక్ష్మమైన విషయాలను గూర్చి కూడ మనకు ఎల్ల వేళలా తెలియదు. ప్రార్థనలలో నుండి దేవుని చిత్తాన్ని తీసివేసేస్తే దేవుని యొక్క అమిత జ్ఞానాన్ని, భవిష్యత్ జ్ఞానాన్ని తీసివేసినట్టే యగును. క్రైస్తవుడెన్నడు దేవుని చిత్తానికి విరుద్ధముగా అడుగరాదు, ప్రవర్తించ రాదు.

- హోలిస్ మిల్లర్

# దేవుని రాజ్యము

## ( The Kingdom of God)

క్రీస్తురాక 600 సంవత్సరముల పూర్వము దేవుడు భూమిపై తన రాజ్యమును స్థాపించబోవు దినమును గూర్చి దానియేలు ప్రవచించాడు (దాని 2:44). క్రీస్తు యొక్క మార్గము, క్రీస్తు సంఘమే ఆ రాజ్యము (మత్తయి 16:18). సంఘమే నిశ్చలమైన ఆ రాజ్యము (హెబ్రీ 12:28).

ఆ రాజ్యము పరలోక రాజ్యమనియు (మత్తయి 3:2). దేవుని రాజ్యమనియు (మత్తయి 12:28). తదుపరి క్రీస్తు రాజ్యమనియు వివిధములుగా చెప్పబడి యున్నది (కొలస్స 1:13).

క్రీస్తురాజ్యము భౌతికము గాక ఆత్మీయ రాజ్యమని తెలిసికోవాలి. "నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు, నా రాజ్యము ఈలోక సంబంధ మైనదైతే నేను యూదులకు అప్పగింప బడకుండునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహ సంబంధమైనది కాదని" యేసు పిలాతుతో చెప్పెను (యోహాను 18:36). క్రీస్తురాజ్యము ఏదేని ఒక భూభాగమును స్వాధీనము చేసికొని లేదు. దాని శిష్యుల హృదయములే దాని భూభాగము. అందుకే "దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నదని" యేసు చెప్పెను (లూకా 17:20,21). గనుక అది పరలోక రాజ్యమనబడినది. అది పరలోకములోనే ఆరంభ మాయెను. పరలోకమేదాని గమ్యము.

జనులను పరలోకపౌరస్థితి కొరకు సిద్ధపరచుటయేదాని ధ్యేయము (ఫిలిప్పీ 3:20).

దేవుని రాజ్యము దైవిక చక్రవర్తి చే పాలింపబడును. యేసుకు దేవుడు ఇహపరముల యందు సర్వాధికార మిచ్చియున్నారు (మత్తయి 28:18). అందు వలన అది దేవుని ప్రియ కుమారుని యొక్క రాజ్యము (కొలస్స 1:12,13). ఆయన రాజులకు రాజును, ప్రభువులకు ప్రభువునై యున్నారు (1తిమోతి 6:14-16). ఆయన రాజ్యమైన సంఘమును పాలించుటకు ఏ మనుష్యునికి గాని, మనుష్యుల గుంపుకు గాని అధికారము లేదు. ఏలయనగా క్రీస్తు ఒక్కడు మాత్రమే ఆయన సంఘమునకు లేదా రాజ్యమునకు శిరస్సైయున్నారు (ఎఫెసీ 1:22).

క్రీస్తు యొక్క ఆత్మీయ రాజ్య పౌరులు ఆయన రక్తము వలన రక్షింప బడి సంఘముతో చేర్చబడిన వారు. పరలోకమందున్న తండ్రి ఒకని అంధకార సంబంధ రాజ్యము నుండి విడుదల చేసినప్పుడు వానిని తన ప్రియ కుమారుని రాజ్యమందు చేర్చును (కొలస్స 1:13; అపో.కా. 2:47). ఆయన మనలను దేవునికి ఒక రాజ్యముగాను, యాజకులను గాను చేసెనని యోహాను క్రైస్తవులకు తెలియ జేయుచున్నాడు (ప్రకటన 1:6). ప్రతి క్రైస్తవుడు దేవుని యాజకుడే. అందు వలన అతడు ఆయన రాజ్యసభ్యుడు (1 పేతురు 2:5,9). ఇంకా రక్షింప బడకుండా యున్నవారు అంధకార సంబంధ రాజ్యములో యున్నవారు, దేవుని రాజ్యములో లేనివారు, దేవుని రాజ్యపౌరుడు కావాలంటే ఒకడు నీటి మూలముగాను, ఆత్మమూలముగాను జన్మించాలి (యోహాను 3:3-5). పాపి యైనవాడు మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు ఈ క్రొత్త జన్మ సంభవించును (అపో.కా. 2:38).

క్రీస్తు యొక్క ఆత్మీయ రాజ్యము నీతి సూత్రములతో పాలించబడును. " యెహోవా న్యాయవిధులు సత్య మైనవి, అవి కేవలము న్యాయమైనవి"

(కీర్తన 19:9). "ఆత్మ యొక్క నియమము పాప మరణముల నియమము నుండి విడిపించును" (రోమా 8:2). క్రీస్తు యొక్క నియమము (గలతీ 6:2) శ్రేష్ఠమైన నూతన నియమము (హెబ్రీ : 6-13). అది స్వాతంత్ర్యమునిచ్చు సంపూర్ణ నియమము (యాకోబు 1:25).

దేవుని రాజ్యపౌరసత్వము విలువైన అనేక దీవెనలనిచ్చును. ఆయన రాజ్యములో మనకు విమోచనము అనగా మనకు పాప క్షమాపణ కలుగుచున్నది (కొలస్స 1:13). పరలోక విషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదము మనకు కలుగుచున్నది (ఎఫెసీ 1:3). రాజ్యపౌరులుగా క్రీస్తు మన యందు నివసిస్తు, మహిమ నిరీక్షణయై యున్నారు (కొలస్స 1:27).

పరలోక రాజ్యము యొక్క గమ్యము ప్రకాశమానమైనది, మహిమ గలది. మృతులను లేపుటకు యేసు మరల వచ్చునప్పుడు ఆయన తన రాజ్యమును తండ్రి కప్పగించును (1 కొరింధీ 15:24). "వ్యభిచారియైనను అపవిత్రుడైనను విగ్రహారాధికుడై యున్న లోభియైనను క్రీస్తుయొక్కయు దేవుని యొక్కయు రాజ్యమునకు హక్కు దారుడు కాడు" (ఎఫెసీ 5:5, 1 కొరింధి 6:9-11). పరలోకములో ఈ రాజ్యపౌరులు నూతన శరీరములు గలవారై వ్యాధిబాధలు, వృద్ధాప్యము లేని వారైయుందురు (1 కొరింధి 15:50-52). అనుభవించుటకు నిత్య జీవము వారిదగును (2 పేతురు 1:11). వారు తమ సృష్టికర్తయు విమోచకుడైన వాని ముఖదర్శనము చేయుచు యుందురు గనుక అది వర్ణింప శక్యము గాని నిత్యజీవము (ప్రకటన 22:1-5).

నీవు నీటిమూలముగాను, ఆత్మ మూలముగాను జన్మించావా? నీవు నమ్మకమైన పౌరునివలె రాజ్యము కొరకు జీవిస్తూ రాజును సేవించు చున్నావా? నమ్మకముగా యున్నవారే నిత్యజీవ కిరీటాన్ని అందుకొంటారు! (ప్రకటన 2:10).

- జాన్ వాడీ (సి.టి.ఎన్)

# వాక్యము ఏలాగు ప్రబలమాయెను?

## ( How did the word of God increase ?)

"దేవుని వాక్యము ప్రబలమై శిష్యుల సంఖ్య యెరూషలేములో బహుగా విస్తరించెను" (అపో.కా. 6:4) దేవుని వాక్యము ఏలాగు విస్తరించెనో అనేకులు గ్రహింపకున్నారు.

దేవుడు వాక్యమును మరికొంత బయలుపరచెనని కొందరు చెబుతుయుంటారు. వాక్యము సైజులో ఎక్కువగా బయలుపరచబడెనని వారి యుద్దేశ్యము. అంటే విశ్వాసులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధకు ఏమైనా కలుపబడినదని వారి ఉద్దేశ్యము కాదు (యూదా : 3). సువార్తను బోధించుటకు అవుసరమైన బయల్పాటు కలుగుచుయుండెను. మోర్మన్ మతశాఖలవారి పుస్తకము, మరికొన్ని అట్టి పుస్తకములు వాక్య విస్తరణలోనికి రావు. అవి మనుష్యుల మాటలు గాని దేవుని మాటలు కావు. వాక్యమును బయలుపరచుట ఎప్పుడు ఆవవలెనో పరిశుద్ధాత్మునికి తెలియును. మతశాఖలవారు దేవుడేదో తమకు బయలు పరచుచున్నారని చెబుతు ద్రోహము చేయుచున్నారు.

నిజానికి వాక్యమును ప్రకటించుటలో విస్తరణ జరిగెను. అపొస్తులులు విధవరాండ్రకు, మరికొందరికి ఆహారము పంచిపెట్టే పనిని యితరులకు అప్పగించినందున వారు మరింత ఎక్కువ వాక్యమును ప్రకటించగలిగిరి. ఆ పనిని వారు కొందరికి అప్పగించి, వాక్య పరిచర్య యందును ప్రార్ధన చేయుటయందును ఎడతెగక యుండిరి. ఆహారము పంచి పెట్టేపని ఇతరులకు అప్పగింపగా అపొస్తులులకు వాక్యపరిచర్య చేయుటకు మరింత ఎక్కువ సమయము లభించెను.

దేవుని వాక్యమును అంగీకరించుటలో కూడ విస్తరణ జరిగెను. వాక్యమే విత్తనము గనుక అది రహస్యమేమీ కాదు. విత్తనములు విత్తబడగా అక్కడ విస్తరణ జరుగును.

విత్తినదాని యొక్క నిష్పత్తిలో పంట కూడ యుండును. విత్తకపోతే పంట లేనేలేదు. దీనిలో మినహాయింపు యేమీ లేదు.

యితరులకు పరిచర్య చేయుటలో పవిత్రత నిష్కళంకమైన భక్తి ప్రదర్శింబడవలెను. సణుగులు, గొణుగులు, విసుగులు, చాడీలు మొదలగునవున్నచోట దేవుని వాక్యము ప్రబలమై విస్తరించదు.

ఒకప్పుడు సువార్తికుని సందేశము వినుటకు ప్రజలు సునాయాసముగా వచ్చేవారు. ఇప్పుడు ప్రజలలో అంత ఆసక్తిలేదు. అయితే ఎవరైనా రావాలంటే మనమే ముందు వెళ్లాలి. అప్పుడు మాత్రమే దేవుని వాక్యము ప్రబలమై విస్తరించెనని చెప్పగలము.

-బ్రూస్ బక్లీ

## అమర్త్యత
### ( Immortality )

"నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము. అయినను శరీరము తో నేను జీవించుటయే నాకున్న పనికి ఫలసాధనమైన యెడల నేనేమికోరు కుందునో నాకు తోచలేదు. ఈరెంటి మధ్యను ఇరుకునబడియున్నాను. నేను వెడలిపోయి క్రీస్తుతో కూడ నుండవలెనని నాకు ఆశయున్నది. అది నాకు మరి మేలు" అని అపో. పౌలు వ్రాసాడు (ఫిలిప్పీ 1:21-23). పౌలు నిజంగా తన దృష్టి అంతయు పై నున్న వాటి మీదనే యుంచాడు (కొలస్స 3:1-3). నిజానికి నిత్యము జీవించాలనే కోరిక మానవులందరికి సహజమే.

అన్ని కాలములలోను, అన్ని చోట్లను, అన్ని జనాంగములలోను యున్న ప్రజలందరికీ మరణం తరువాత జీవంవున్నదనే నమ్మిక యున్నది. పూర్వకాలమందున్న ఐగుప్తీయులు మరణానంతరం వుండే జీవము కొరకు తీర్పు కొరకు

చనిపోయిన వారి శరీరములను కుళ్లిపోకుండా సుగంధ ద్రవ్యములతో పూతపూసి యుంచేవారు. గ్రీకులైతే చనిపోయిన వాని నోటిలో ఒక నాణెముంచేవారు. తద్వారా వాని ఆత్మను తమ దేవత జీవనది ద్వారా తీసుకెళ్లునని వారు తలంచేవారు. రెడ్ ఇండియన్స్ అయితే తమ తెగ నాయకుడు చనిపోతే వాని గుర్రమును చంపి, వాని ఆయుధములను విరుగ గొట్టే వారు. రాబోవు జీవితంలో అవివానికి పనికివస్తాయని వారి యభిప్రాయము.

నేడు గొప్ప వేదాంతవేత్తలు, సాహితీకర్తలు, శాస్త్రజ్ఞులు కూడ నిత్య జీవమునందున్న తమ విశ్వాసాన్ని గూర్చి వ్రాయుచున్నారు. ఇంగిత జ్ఞానమా, భవిష్యత్ జ్ఞానమా యిది మనకు తెలియదు గాని, ప్రతి పక్షి తన గూటికి చేరుకొనునట్లు, అమర్త్యత అనునది మానవుల ఆత్మలను ఆకర్షించు చున్నది.

“మన క్రియలను బట్టి కాక తన స్వకీయ సంకల్పమును బట్టియు అనాది కాలముననే క్రీస్తుయేసు నందు మనకు అనుగ్రహింపబడినదియు, క్రీస్తు యేసును మన రక్షకుని ప్రత్యక్షత వలన బయలు పరచబడినదియునైన తన కృపను బట్టియు మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. ఆ క్రీస్తుయేసు మరణమును నిరర్ధకము చేసి జీవమును అక్షయతను సువార్త వలన వెలుగులోనికి తెచ్చెను” (2 తిమోతి 1:9-10). 1 కొరింధి 15:1-58 కూడ చదువుము.

లాజరు యొక్క సమాధి దగ్గర నిలబడి యేసు, “పునరుత్థానమును జీవమును నేనే; నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును, బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు. ఈ మాట నమ్ము చున్నావా?'' యని అడిగెను (యోహాను 11:25,26).

– పెర్రీ హాల్

# నేడు అద్భుత స్వస్థలు జరుగుచున్నవా ?

## ( Are miracles of Healing done Today?)

మొదటి శతాబ్ధములో అద్భుత స్వస్థలు యదార్ధము. నేడు 'భక్తుల' ద్వారా యదార్ధముగా జరిగే అద్భుత స్వస్థతలు యేమీ లేవు. యేసు ప్రభువు నిజముగా దేవుని కుమారుడని మనము నమ్మునట్లును అపొస్తులులు కూడ దేవుని యధికారము పొందిన వారని నిర్ధారించుటకును దేవుడు వారికి అద్బుత వరములనను గ్రహించెను (యోహాను 20: 30, 31; మార్కు 16:20). పరిశుద్ధాత్మావేశము వలన అపొస్తులులు దేవుని చిత్తమును పరిపూర్ణముగా మనకు రికార్డు చేసి యిచ్చిరి (1 కొరింధి 2:12, 13). అపొస్తులులకును, వారు చేతులుంచిన వారికిని అద్భుతములు చేసే శక్తి ఈయబడెను (అపొ.కా. 2:4; 8:17). అందరికీ ఈ అద్భుత వరములు ఇయ్యబడలేదు (అపొ.కా.8: 18,19).

క్రొత్త నిబంధన సంపూర్తిగా వ్రాయబడినపుడు అద్భుతములు నిలిచిపోయెను. 1 కొరింధి 12, 13 అధ్యాయములు ఈ అద్భుతవరములను గూర్చి తెలియజేస్తాయి. అవితాత్కాలికమైనవని అవి తెలియ జేస్తాయి. "పూర్ణమైనది వచ్చినపుడు పూర్ణము కానిది నిరర్ధకమగును" (1 కొరింధీ 18:10). పూర్ణము కానిది ఈ యద్భుతవరములు. 'పూర్ణమైనది' క్రొత్త నిబంధన (యాకోబు 1:25, 2 తిమో 3:16,17). బైబిలు క్రీ.శ. 100వ సంవత్సరములోపు సంపూర్తి చేయబడెను. తదుపరి అద్భుతములు నిలిచిపోయెను. చారిత్రాత్మకముగా దీనిని నిర్ధారించవచ్చును. దేవుని వాక్యమును బయలుపరచి దానిని స్థిరపరచుటకు అద్భుతములు అవుసర మాయెను. క్రొత్తనిబంధన ఇయ్యబడి, స్థిరపరచబడినప్పుడు, రికార్డు చేయ బడినప్పుడు, అద్భుతములు అవుసరత యిక లేకపోయెను.

కొందరు రోగులు వీరి దగ్గరకు వెళ్లుటవలన స్వస్థ పడుదురు. అది ఆ భక్తుల ప్రభావము యేమీకాదు. మనకు సంభవించే రోగములు, బాధలు కాలాన్ని బట్టి నయమగును.

దేవుడు మన శరీరాన్ని అట్లు చేసారు. స్వల్పనొప్పులు, రోగములు వాటికవే ప్రకృతి సహజముగా నయమవుతాయి. సరిగదా మనకు సంభవించే వ్యాధి బాధలు 85 శాతం మానసికమైనవే, అంటే మానసిక ఆందోళన వలన, ఒత్తిడి వలన సంభవించినట్టివే. అట్టి సందర్భములో ఈ 'అద్భుత వైద్యుడు' ఆ రోగిని దేవుడు స్వస్థపరిచాడని నమ్మించగలిగితే, దానిని బట్టి ఆ రోగి బాగుపడినట్లు భావిస్తాడు. అందు వలననే "Power of mind over matter" అనే మాటను మీరు వినయే యుంటారు.

మానసిక ఆరోగ్యము కొరకు విశ్వాసము, పట్టుదల అత్యవసరము. అందువలన రోగియైన వాని మానసిక స్థితి కుదుటపడుటవలన అతడు బాగుపడవచ్చును. అయితే అది అద్భుతముకాదు. సైకియాట్రిస్టులు, హిప్నోటిస్టులు, కౌన్సలర్లు రోజు చేసే పనేయిది. వారేమి స్వస్థత వరముగల వారమని ప్రకటించుకోరు. స్వస్థ వరము గల వారమని చెప్పుకొనే వారందరు మోసగాళ్ళుకాదు. వారు సత్యవాక్యమును సరిగ గ్రహించక అపవాది చేత మోసగించబడినవారు (2 థెస్స 2: 11,12).

- జాన్‌వాడీ

# తన ముగ్గురు మిత్రులతో యోబు తర్కము

## ( Job' s controversy with his three Friends )

యోబు గ్రంథము 3:1,2 తప్ప మూడవ అధ్యాయము మొదటి నుండి 31వ అధ్యాయము ఆఖరి వరకు అంతా పద్యరూపముగా యున్నది. ఒక అంశమును అర్థము చేసికొనడానికి ఈ వాస్తవము ఎరిగి యుండాలి. పద్య కావ్యములో ప్రతిలైను మరొకదానికి సమానాంతరముగా యుండును. అందులో క్రొత్త తలంపు యేమీ వుండకపోవచ్చును.

**తన జన్మదినమును యోబు ఏవగించుకొనుట (యోబు 3:1-10). :**

యోబు తనకు సంభవించిన విపత్తుల వలన బందీయాయెను. ఆ విపత్తులను గూర్చిన వివరణ

అతనికేమీ తెలియకపోయెను. యోబు సంభాషించుట వలన తనకు తన మిత్రులకు మధ్య నుండి నిశ్శబ్ధము తొలగిపోయెను. తనకు ప్రస్తుతమున్న గతివలె అందరికీ యుంటే ఒకడు జన్మించడం దేనికి?

యిర్మియా వలె గొప్ప బాధకరమైన దినముల నెదుర్కొనుచు యోబు తాను జన్మించిన దినమును గూర్చి చింతించెను. అతను తీవ్రమైన ఆందోళనకు, శారీరక రుగ్మతకు గురియైనవాడాయెను. అట్టి పరిస్థితి అతనికి సంభవించడానికి గల కారణము నతడు కనుగొనలేక పోయెను. కేలండర్ నుండి తన జన్మ దినమును తొలగించుటకతడు కాంక్షించెను. అందరివలె కాక యోబు తన జన్మదినమును ఇతరులెవరు జ్ఞాపకము చేసికొననవసరము లేదని కాంక్షించాడు. అందువలన యోబు తన ఆత్మ యొక్క ఆవేదనను వెళ్ళగక్కెను.

తాము జన్మించి యుండకపోతే మంచిదని యోబు, యిర్మియా కూడ తలంచినను వారిలో ఎవ్వడును ఆత్మహత్యను గూర్చి తలంచలేదు. అది ఎందువలన? అంత గొప్ప బాధ ననుభవించు చున్నను ఈ గొప్ప పురుషులు తమ సృష్టికర్తను, వారి ఉనికికి కారణభూతుడైన వాని యందున్న తమ విశ్వాసము కోల్పోవ లేదు. ఒకానొక దినమందు ఆసృష్టికర్త యెదుట తీర్పులో నిలబడాలని వారెరిగి యుండిరి. యోబు తన జన్మదినమును శపించాడు గాని దేవునిని కాదు.

**పుట్టుకతోనే తాను మరణించియుంటే బాగుండునని యోబు తలంచాడు (యోబు 3:11-19). :**

పుట్టుకతోనే నేనేల చావక పోతిని? గర్భము నుండి బయలుదేర గానే నేనేల ప్రాణము విడువక పోతినని" యోబు వాపోయాడు. తాను గర్భములో పడిన దినమును నివారింపకలేకపోయిన యెడల జనన దినమందే నేనేల మరణించకపోతినని యోబు తలంచాడు (3:11,12). రెండు వచనములలో 4 మార్లు తానేల చావకపోతినని యోబు ప్రశ్నించుకొన్నాడు. అట్టి ప్రశ్నలు దేవుని యొక్క జ్ఞానాన్ని ప్రయోజనమును ప్రశ్నిస్తాయి.

సర్వశక్తుడైన దేవుని సంకల్పాన్ని, కాపుదలను ప్రశ్నించుటకు మర్త్యుల మైన మనము తగము.

క్రైస్తవేతరులు, అనాలోచిత క్రైస్తవులు మరణములో భూసంబంధ మైన దు:ఖనివారణ పొందుదుమనే భావము కలిగియుందురు. మానవుని ఆత్మ అమర్త్యమైనదని, అది గడిపే నిత్య నివాసమొకటి యున్నదనే సత్యాన్ని వారు పరిగణలోనికి తీసికొనరు. తీర్పు నాడు మానవుని ఆత్మ నిత్యనరకానికో నిత్యజీవానికో పంపబడును.

భౌతిక బాధననుభవించు క్రైస్తవేతరుడు మరణించగా అతడు భూసంబంధమైన సాధక బాధకముల నుండి విడుదల పొందాడని తలంచుట కద్దు. ఒక విధముగా యిది కొంత మట్టుకు వాస్తవమే గాని, చనిపోయిన వాడు తన దేవుని కలసికొనుటకు సిద్ధ పడియుండని యెడల నిత్య యాతనలోనికి పోవును. దాని నుండి విడుదల యేమీ వుండదు.

దిగజారుచున్న పట్టిక సూచికగా యోబు భూరాజులతోను, మంత్రుల తోను ఆరంభించి దాసులు బలహీను లైన వారితో తన్ను పోల్చుకొన్నాడు. మానవ దృక్పథముతో యోబు అల్పులు ఘనులు, పిండదశలోనే మరణించిన వారు అందరు మరణములో విశ్రాంతి పొందుదురని తలంచాడు. అట్టి వారు ఈ లోక సంబంధమైన బాధల నుండి విరామము పొందినవారు. యోబు యొక్క ఆలోచన ప్రకారము ఈ లోకదుర్దశ నుండి మరణములో విరామము సంభవించును, అందులో హెచ్చుతగ్గులు యేమీలేవు.

యోబు ఈ మాటలు పలికే సరికి జీవితాన్నంతా ఒకే ఒక్క కోణములో పరికించాడు. దిగువస్థాయి యే గాక జీవితానికి ఇంకా ఎంతో ఉన్నది. దానిలో కొంత సంపదను సౌఖ్యాన్ని గతంలో యోబు అనుభవించాడు. వ్యాధులు, బాధలు ఒకని జీవితాన్ని దుర్భరము చేయును. గతంలో అనుభవించిన సుఖాన్ని మరుగుపరచును. తానునుభవించిన సౌఖ్య సంవత్సరములన్నిటిని యోబు యొక్క ప్రస్తుత దుర్దశ తన మదిలో నుండి తుడిచి వేసెను. బైబిలు వ్యక్తులు అల్పులేమి, ఘనులేమి వారి జీవిత

చరిత్రను లిఖించిన వాడు దేవుడే. వారి పేర్లు, క్రియలు పరిశుద్ధాత్మావేశ పూరిత గ్రంధములో లిఖితములై యున్నవి.

**ఎడతెగని బాధలో యోబు మరణించాలని కోరుకొన్నాడు (యోబు 3 : 20 - 26):**

"దేవుడు యోబుకును అతని యింటి వారికిని అతనికి కలిగిన సమస్తమునకు కంచె వేసెనని" ఇంతకు ముందు సాతానుడు నింద వేసాడు (యోబు 1:10). ఇప్పుడు దు:ఖబాధ యను కంచెను అతని చుట్టు దేవుడు వేసాడని యోబు తలంచాడు. తన దు:ఖ స్థితికి మొదటిసారిగా ఈ పితరుడు దేవునినే కారకునిగా తలంచు చున్నాడు. తన పెదవులతో అతడు పాపము చేసాడు. కంచె వేయబడుటను గూర్చి విలాపవాక్యము 3:7-9 వరకు చూడుము.

తన బాధనుండి మరణములోనే విముక్తి లభించునని యోబు తలంచినను ఆత్మహత్యను అతడు ఆలోచించలేదు. రోగులను దర్శించు బోధకులు, చివరి ఘడియలలో యున్న రోగులు సాధారణముగా, ఇకచాలు, వెడలిపోవుటకు వారు సిద్ధమే యన్నట్లు మాట్లాడుదురు.

పరిపూర్ణము గావించబడిన దైవ గ్రంధమయిన బైబిలును మనము కలిగి యున్నాము. యోబు యొక్క బాధలను చదివిన తరువాత అతని యెడల సానుభూతి కలిగియుండుట సులభమే (1 కొరింధి 10:12 చూడుము). దేవుని నిందింప బూనుకొనకూడదు. నిర్దాక్షణ్యముగా అతడు హింసింప బడిన రీతిగా మనమెవరము హింసింప బడము. అతని బాధను మనము కండ్లారాచూడలేదు. అణగారిన ప్రజల యెడల మనము సానుభూతి కలిగి యుండాలి. సాధ్యమైనంత మట్టుకు వారి దుస్థితిలో సహాయపడాలి (మత్తయి 25:31-46; గలతీ 6:10).

యోబు గతంలో అనుభవించిన సుఖతర జీవితము ఇట్టి దుర్భర స్థితి నుండి కాపాడబడలేదని యోబు గ్రహించుకొన్నాడు. గనుక ఇట్టి దుర్ఘటనలు రాకుండ మనకు మనమే జాగ్రత్తపడాలి. క్రైస్తవులు తమ నాలుకను క్రియలను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎందుకనగా గడ్డు కాలము తప్పక వచ్చును! అయినను

మనం పరలోకమందున్న దేవుని వైపు చూడాలి. "మన యెడల ప్రత్యక్షము కాబోవు మహిమ యెదుట ఇప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని యెంచుచున్నాము" (రోమా 8:18). యోబు విషయంలోనైతే అతని శ్రమల మధ్య విరామ కాలము యేదీ లేకుండెను.

బైబిలు దేవుని వాక్యమై యున్నదని ప్రతి పేజీలోను మనకు దృఢపరచబడుచున్నది. అందున్న మనుష్యుల యొక్క సద్గుణములు, దుర్గుణములు కూడ నిష్పక్షపాతముగా అది చూపించుచున్నది. తన సొంత జీవిత చరిత్రను వ్రాయుచు ఎవడును తన బలహీనతలను లోకానికి తెలియజేయడు. నరిగదా అతని సామర్ధ్యమును, సాధించిన సంగతులను తెలియజేయును. సజ్జనుల యొక్కయు, దుర్జనుల యొక్కయు జీవిత చరిత్రను వ్రాయువాడు దేవుడే. వారి క్రియలు, పేర్లు ఆత్మావేశము వలన దేవుని గ్రంథములో వ్రాయబడి యున్నవి.

– లూయిస్ రష్మోర్

## మంచి విత్తనము
## ( The Good Seed )

కొన్ని సంవత్సరముల క్రితం వార్తాపత్రికలు ఒక బటానీతోట యొక్క చిత్రాన్ని ప్రచురించాయి. ఆ బటానీలు ఎక్కడ నుండి వచ్చాయో కూడా ప్రచురించాయి. అదేమంటే – ఈ జిప్టు దేశంలో పురాతన సమాధులలో కొన్ని బటానీలు లభించాయి. అవి రెండువేల సంవత్సరముల నుండి ఆ సమాధులలో ఉండిపోయాయి. అవి మొలకెత్తునో లేదో చూచుటకు వాటిని నాటి సాగుచేసారు. అరకమైన బటానీలు ఇప్పుడు ప్రపంచములో ఎక్కడా లభించుటలేదు కూడా, అయితే వాటిని పాతిపెట్టినప్పుడవి పెరిగి రెండువేల క్రితం ఉన్నా బటానీలనే ఉత్పత్తి చేసాయి. యిదొక ఆశ్చర్యకర మైన సంగతి!

యేసు విత్తనములను గూర్చిన ఉపమానాన్ని చెప్పారు. ఒకడు

విత్తనము విత్తుచుండగా అవి నాలుగు రకములైన నేలలలో పడినవి. వాటిలో కొన్ని ఫలాలనిచ్చాయి. కొన్ని ఇయ్య లేదు. "విత్తనము దేవుని వాక్యమని" ఆయన వివరించారు (లూకా 8:11). వివిధ రకములైన నేలలేమిటో కూడా ఆయన చెప్పారు. మంచినేలను గూర్చి చెబుతు ఆయన ఇట్లన్నారు; "మంచి నేలను పడిన (విత్తనమును పోలిన) వారెవరనగా యోగ్యమైన మంచి మనస్సుతో వాక్యము విని దానిని అవలంభించి ఓపికతో ఫలించు వారు" (లూకా 8:15).

క్రైస్తవులమని చెప్పుకొను వారిలో రకరకాలైన నమ్మకములు కలవారు నేడున్నారు. రకరకాలైన మొక్కలున్నప్పుడు అవి రకరకాలైన విత్తనముల నుండి కలిగినవని మనం ఎరుగుదుము. అలాగే వివిధములైన 'విశ్వాసము'లున్నప్పుడు అవి కూడా వివిధములైన బోధ నుండి ఉద్భవించె నని మనం ఎరుగుదుము. దేవుని వాక్యమే సరియైన విత్తనం. ఏ బోధయైనా బైబిలునందు కనబడక పోతే అది కాని ఫలమును ఫలించును.

మంచివిత్తనాన్ని ప్రజలు తమ హృదయంలోనికి ఆహ్వానించినప్పుడు ఎట్టి ఫలితమునిచ్చును? అది క్రైస్తవులను మాత్రమే ఫలించును. అది ప్రజలను దేవుని యందును ఆయన కుమారుడైన క్రీస్తు నందును విశ్వాసులుగచేయును. వారు దేవుని ప్రేమించి ఆయన ఆజ్ఞలను వెంబడించు వారిగచేయును. ప్రజలు దేవుని వాక్యమును మాత్రమే వెంబడించిన యెడల మొదటి శతాబ్దములో వారివలే క్రైస్తవులుగా మాత్రమే వారుందురు.

క్రైస్తవులనగా తిరిగి జన్మించిన ప్రజలు, యేసు నీకొదేముతో "ఒకడు క్రొత్తగా జన్మించితేనే గాని అతడు దేవుని రాజ్యమును చూడలేడని నీతో నిశ్చయముగా చెప్పుచునాన్ననెను". మీరు క్షయబీజము నుండి కాక, శాశ్వత మగు జీవముగల దేవుని వాక్యము మూలముగా అక్షయ బీజము నుండి పుట్టింపబడినవారు".

సంఘమే మంచి విత్తనము యొక్క ఫలము కూడా. ఒకడు విశ్వాసముతో వాక్యము నంగీకరించి విధేయుడైతే అతడు క్రైస్తవుడవుతాడు.

యితరులు కూడా అట్లేచేస్తే వారు కూడ క్రైస్తవులవుతారు. అట్టి క్రైస్తవుల సమూహమే క్రీస్తుసంఘం. క్రైస్తవులు సంఘముగా దేవుని ఆరాధిస్తు సేవ చేయుదురు. దేవుడు తన వాక్యములో సంఘమునకు హెచ్చరికల నిచ్చారు. క్రైస్తవులు ఆరాధిస్తూ, క్రైస్తవ జీవితాన్ని జీవిస్తు క్రీస్తును గూర్చి యితరులకు చెప్పాలని ఆయన కోరుచున్నారు. ఈ రీతిగ సంఘము తనపని చేయాలని ఆయన కోరుచున్నారు.

విత్తనము కాని విత్తనము విత్త బడుననియు అది కాని ఫలముల నిచ్చు ననియు పౌలు హెచ్చరించాడు. అతడు ఎఫెసులోని సంఘపెద్దలకిట్లు చెప్పాడు: "నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్ళు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు, మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు" (అపొ. 20:29,30).

"మీరు నా వాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులై యుందురని'' యేసు చెప్పెను (యోహాను 8:31). యేసు ఈ లోకమందుండగా చెప్పిన మాటలు ఆయన మాటలే. ఆయన పరమునకు తిరిగి వెళ్ళి తన అపొస్తలులను, యితరులను ఆయన వాక్యములో నడిపించుటకు పరిశుద్ధాత్మని పంపెను. పరిశుద్ధాత్ముడు వారికిచ్చిన మాటలు కూడా క్రీస్తు మాటలే. పరిశుద్ధాత్మని వాగ్దానము చేసినప్పుడు, "ఆయన నా వాటిలోనివి తీసికొని మీకు తెలియజేయును గనుక నన్ను మహిమపరుచును. తండ్రికి కలిగిన వన్నియు నావి. అందుచేత ఆయన నా వాటిలోనివి తీసికొని మీకు తెలియజేయునని నేను చెప్పితిననెను" (యోహాను 16:14,15).

దేవుని పవిత్ర వాక్యమును మన హృదయములలోనికి ఆహ్వానిద్దాం. దానిని నేర్చుకొంటూ, దాని ప్రకారం జీవిస్తూ కొనసాగుదాం. ఆయన వాక్యంలో లేని బోధను తిరస్కరించుదాం. చివరకు దేవుని మహిమలో, రక్షించబడిన వారందరితోను నిత్యజీవితం మన ఫలం!!

- ఓ.పి. బెయర్డ్

# సంక్షిప్త వార్తలు

2019వ సంవత్సరము ఆసక్తిదాయకముగానే ఆరంభమాయెను. 2018 డిశంబరు 31వ తేదీ రాత్రివేళ సత్యవాణి-క్రీస్తుసంఘములోనికి ఒక స్త్రీ బాప్తిస్మము పొంంది తన గతపాప విముక్తురాలై నూతన సంవత్సరములో ప్రవేశించెను. మరియు జనవరి 6వ తేదీన మొదటి ఆదివారము నాడు మరియొక స్త్రీ క్రీస్తులోనికి చేర్చబడెను.

2019 జనవరి 7,8 సోమ,మంగళ వారములలో సత్యవాణి క్రీస్తు సంఘములో **Lads to Leaders (బాలకుల నుండి పాలకులయ్యేవరకు)** అను కార్యక్రమము సమర్ధవంతముగా విజయవంతముగా కొనసాగెను. పలు గ్రామ, పట్టణ స్థానిక సంఘముల నుండి 530 మంది యౌవనస్థులు సత్యవాణి ఆవరణలో ఆ రెండు దినములు గడుపుచు గొప్ప ఆత్మీయానుభూతిని పొందిరి.

**బాలకుల నుండి పాలకులయ్యే వరకు (Lads to Leaders)** అను కార్యక్రమము 54 సం॥ల క్రితము బాలబాలికలను, యువకులను సంఘనాయకులుగా తయారుచేసే పనిలో అమెరికాలో 74 మంది యువకులతో తొలుత ప్రారంభమాయెను. ఇప్పుడది వేలకొలది యువకులతో కిటకిటలాడుచున్నది. అమెరికాలో ఆయా స్థానిక సంఘములు ఈ కార్యక్రమమును నిర్వహించినను, సంవత్సరమునకొకసారి వార్షిక కన్వెన్షన్ **(Annual Convention)** కొరకు ఒక చోట కూడుకొందురు. వాటిలో 10 నుండి 20 వేలమంది యువకులు పాలు పుచ్చుకొందురు.

ఈ యువకులు పాటలు పాడుట, వాక్యపఠనము, కంఠస్థ వాక్యములు, చిరుప్రసంగములు వగయిరా కార్యక్రమములలో పాలుపొందుదురు. ఆయా వయస్సులను బట్టి వాటిలో పాల్గొన్న వారికి బహుమతులు, సర్టిఫికెట్లు ఇయ్యబడును.

అదేవిధముగా ఈ సంవత్సరము భారతదేశములో మొట్టమొదటిసారిగా **Lads to Leaders** కార్యక్రమమును నిర్వహించే బాధ్యతను రిక్కీగూటం గారు స్వీకరించిరి. హాజరైన వందలాది విద్యార్థినీ, విద్యార్థులు పాటలు పాడుచు, క్విజ్‌ప్రోగ్రాంలలో పాల్గొనుచు, కంఠస్థవాక్యములనందిచుచు మొదలగు కార్యక్రమములలో పాల్గొనిరి. అందరికీ బహుమతులు ఇయ్యబడెను. 450 కంటే ఎక్కువ కంఠస్థ వాక్యములను నిరాటంకముగా వల్లించిన అనిల్ కుమార్

అను ఒక యువకునికి రిక్కీగూటం గారు ఒక లాప్‌టాప్ కంప్యూటర్‌ను బహూకరించిరి. మరియు సత్యవాణి చిల్డ్రన్ హోమ్‌లో యున్న 13 ఏళ్ళ గంగ అను బాలిక 352 వాక్యములను కంఠోపదాయకముగా వల్లించి రెండవ బహుమతి పొందెను.

హాజరైన వారందరికి **Lads to Leaders** చిత్రపటములను ముద్రించిన టి.షర్టులు, క్యాప్‌లు, సర్టిఫికేట్‌లు బహుకరించబడెను. రిక్కీగూటం, రోనీగూటం, రాబిన్ గూటం గార్లును, వారి సతీమణులు సుదీప, హరిత మరియు రేచెల్ గూటం గార్లును సోదరి ఎలిపే సువార్తమ్మ గారును ఈ కార్యక్రమములో ఎంతో సహకరించిరి. **బాలకుల నుండి పాలకులు** వరకు అనే కార్యక్రమము ప్రతి సంవత్సరము నిర్వహించుటకును, తద్వారా స్థానిక సంఘములలో నాయకులు ఏర్పడుటకును సహాయపడునట్లు సంకల్పములు జరుగుచున్నవి. రెండు దినముల తరువాత హాజరైన వారందరు తమ తమ గ్రామములకు, పట్టణములకు సంతోషముతో తిరిగి వెళ్లిరి.

**RNI Regd. No. 69973/98**

**Postal Regd. No. AP/KD-02/2018-20**

From :
**SATYAVAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004.